సాక్షి
అన్నమయ్య జిల్లా
బుధవారం । 28 । జూన్ । 2023



ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. -8లో..



సమస్యల పరిష్కారానికి కృషి

ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రేంజి ఏపీఎస్పీ బెటాలియన్‌ల -3 డీఐజీ సి.హెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.520	రూ.720
రెండోరకం	రూ.300	రూ.510

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1,278 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	300	340
సీబీ	-	-

మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 77.66 కిలోలు

న్యూస్‌రీల్

29న టమాటా మార్కెట్‌కు సెలవు

మదనపల్లె సిటీ: బక్రీద్‌ను పురస్కరించుకుని మదనపల్లె టమాటా మార్కెట్‌కు ఈనెల 29న సెలవు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి అభిలాష్ తెలిపారు. 28న బుధవారం సాయంత్రం మార్కెట్‌కు రైతులు టమటాలు తీసుకు రావద్దని సూచించారు. ఈ విషయాన్ని రైతులు గమనించాలని కోరారు.

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి



సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు

సంబేపల్లె : శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నమయ్యజిల్లా ఎస్పీ కె.గంగాధర్‌రావు పోలీసులకు సూచించారు. మంగళవారం సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులపై దృష్టి పెట్టాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసుల పురోగతి గురించి చర్చించారు. జాతీయరహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల గురించి అడి తెలుకున్నారు.

గ్రామాభివృద్ధిలో ఆర్పీల పాత్ర కీలకం

కడప సెవెన్‌రోడ్స్: గ్రామాభివృద్ధిలో రీసోర్స్ పర్సన్ల (ఆర్పీ)పాత్ర కీలకమైనదని వైఎస్సార్ జిల్లా డీపీఓ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం జెడ్పీ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో రీసోర్స్ పర్సన్లకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రీసోర్స్ పర్సన్లకు జీపీడీపీ, ఈ-గ్రామ స్వరాజ్, పీఎఫ్ఎంఎస్ అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు.

ఫ్రెష్.. ఫిష్



- ప్రజలకు చేరువగా మత్స్య సంపద
- జిల్లాలో గణనీయంగా పెరిగిన చేపల వినియోగం
- పట్టణాలు, మండలాల్లో ఫిష్ ఆంధ్ర షాపులు

సాక్షి రాయచోటి : మత్స్యకారుల సంక్షేమానికి, వినియోగదారుల ఆరోగ్యానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్దపీట వేస్తున్నాయి. ఫిష్ ఆంధ్ర, ఫిట్ ఆంధ్ర నినాదంతో మంచి చేపలు వినియోగదారుల ముంగిటకే తెస్తోంది. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపడుతోంది. ప్రజలకు చేపను చేరువ చేయడం ద్వారా అనేక రకాల ప్రయోజనాలు ఉంటాయన్నది ప్రభుత్వ ఆలోచన. మాంసం కంటే కూడా చేపలు ఆరోగ్యానికి మంచివని చెబుతున్న నేపథ్యంలో ప్రజలకు నాణ్యమైన చేపలు అందిస్తున్నారు.

జిల్లాలో 25 చోట్ల రీటైల్ అవుట్‌లెట్లు

జిల్లాలో ఎక్కడికక్కడ చెరువులు, రిజర్వాయర్లలో చేపల పెంపకం జరుగుతోంది. మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మత్స్యశాఖ పథకాలకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు రుణ సదుపాయం కల్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే 25 రిటైల్ ఫిష్ అవుట్‌లెట్స్ ఏర్పాటయ్యాయి.ఇవి ఆది, సోమ, మంగళ, బుధవారాల్లో వినియోగదారులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలతో జిల్లాలో చేపల వినియోగం పెరిగింది. అదే సమయంలో మత్యకారుల సంక్షేమానికి బాటలు వేసినట్లు అయింది. అన్నమయ్య జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఫిష్ ఆంధ్ర రిటైల్ యూనిట్లు ఏర్పాటయ్యాయి.



చేపల విక్రయ కేంద్రాల వద్ద రద్దీ (ఫైల్)

పెరిగిన చేపల వినియోగం

జిల్లాలో రీటైల్ అవుట్‌లెట్ల ద్వారా తాజా చేపలు అందిస్తున్నారు. మటన్, చికెన్‌తోపాటు విందులు, వినోదాలు, ఫంక్షన్లలో చేపల వినియోగం పెరిగింది. ప్రజలు కూడా ఆదివారం మటన్, చికెన్‌లను వినియోగిస్తే మిగిలిన రోజుల్లో చేపలను తీసుకుంటున్నారు. జిల్లాలోని రిజర్వాయర్లు, చెరువుల్లో ఉత్పత్తి చేస్తే చేపలతోపాటు బయటి ప్రాంతాల నుంచి వచ్చే వాటిని కూడా కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇటీవలి కాలంలో చేపల వినియోగం పెరిగినట్లు మత్స్యశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

చాలా సంతోషంగా ఉంది



నా పేరు రియాజుద్దీన్. రాయచోటిలో నివాసంటున్నాను. మత్స్యశాఖ కొద్ది నెలల క్రితం రిటైల్ అవుట్‌లెట్ యూనిట్‌ను మంజూరు చేసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రాయచోటిలో చేపలు విక్రయిస్తాను. వారానికి 700 నుంచి 800 కిలోల వరకు విక్రయిస్తాను. అన్ని ఖర్చులు పోను రోజుకు రూ.1,000 నుంచి రూ.1,200 వరకు ఆదాయం వస్తోంది. చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు.

చేపల అమ్మకాన్ని ప్రోత్సహిస్తున్నాం



చేపల అమ్మకాన్ని ప్రోత్సహిస్తున్నాం. బ్యాంకుల ద్వారా రుణాల ఇప్పిస్తున్నాం. మత్స్యకారులకు కిసాన్ క్రెడిట్ కార్డులు కూడా ఇస్తున్నారు. గతంలో సగటు ఒక వ్యక్తి ఏడాదికి 8 కిలోలు చేపలు మాత్రమే తీసుకునే వారు. దీనిని 24 కిలోలకు పెంచుతున్నాం. మత్స్యశాఖ పథకాలను పొందేందుకు మరిన్ని వివరాలకు మొబైల్ నంబర్లకు ఫోన్ చేయవచ్చు.

-సుస్మిత, జిల్లా మత్స్యశాఖ అధికారి, అన్నమయ్య జిల్లా

ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చేపలు ఆరోగ్యానికి మంచివి. వీటిలో పిండిపదార్థాలు ఉండవు. కాల్షియం ఫాస్పరస్, ఐరన్, మెగ్నీషియం, కాపర్, జింక్ వంటి ఖనిజాలు, ప్రొటీన్లు ఉంటాయి. వ్యాధినిరోధక శక్తిని పెంచుకోవడానికి చేపలు తినాల్సిన అవసరం ఉంది. అత్యధిక పోషకాలున్న మత్స్యసంపద ప్రజలకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా ప్రజలు అధికంగా చేపలు వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఫిష్ ఆంధ్ర యూనిట్లను ఏర్పాటు చేస్తోంది. జిల్లాలోని నిరుద్యోగులు ఫిష్ ఆంధ్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – పీఎస్ గిరీషా, జిల్లా కలెక్టర్

స్పోర్ట్స్ స్కూల్‌కు విద్యార్థుల ఎంపిక

మదనపల్లె సిటీ: వైఎస్సార్ జిల్లా కడపలోని స్పోర్ట్స్ స్కూల్ 4,5 తరగతుల ప్రవేశానికి జిల్లా స్థాయిలో ఎంపికైన విద్యార్థుల వివరాలను సెప్ట్ సీఈఓ సాయిగ్రేస్, డీఎస్‌డీఓ షేక్ షఫీ తెలిపారు. కె.నితీష్ (రాజంపేట), సుహాస్‌వైభవ్‌రెడ్డి(కలకడ), సి.సహాస్ ప్రిన్స్(మదనపల్లె), ఈ.నీహారిక(రామపురం), ఎ.ప్రియ నందిని(సంబేపల్లి), ఎం.చంద్రిక (ఓబులవారిపల్లె), బి.నితిన్‌నాయక్(గుర్రంకొండ), ఎస్.మహమ్మద్‌రాయన్ (రాజంపేట), పి.లోహిత్‌కుమార్‌రెడ్డి(రామాపురం), బి.మోక్షజ్ఞ మహర్షి(చిట్వేల్), పి.ప్రణీత్(లక్కిరెడ్డిపల్లె), యు.స్వప్న(చిన్నమండ్యం), కె.విజయేశ్వర్(సికెదిన్నె) ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈనెల 29,30 తేదీల్లో గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీలో జరిగే రాష్ట్ర స్థాయిలో ఎంపికల్లో పాల్గొంటారని తెలిపారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష అమలు: జేసీ



సంబేపల్లెలో జగనన్నసురక్ష పథకం పనితీరుపై ఆరాతీస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

సంబేపల్లె: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అన్న మయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సంబేపల్లె మండల కేంద్రంతో పాటు గున్నికుంట్ల, గురిగింజకుంట గ్రామాల్లో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన పరిలించారు. ఇంటింటికి తిరిగి పథకం పనితీరు గురించి ఆరాతీశారు. ప్రజలకు అవసరమైన సేవలను టోకెన్లుగా నమోదు చేసి, వాటిని సచివాలయాల్లో సర్వీసెస్ రిక్వెస్ట్ రూపంలో జనరేట్ చేయాలని ఆదేశించారు. జగనన్నసురక్ష పథకం కార్యక్రమంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సౌమ్యనాథుని బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పుట్టమన్ను తీసుకొస్తున్న అర్చకులు



స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు పూజలు

నందలూరు(రాజంపేట): అన్నమయ్య జిల్లాలో ప్రసిద్ధి చెందిన నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం రాత్రి ప్రారంభమయ్యాయి. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. తొమ్మిదిరోజులపాటు జరిగే బ్రహ్మోత్సవాలకు మంగళవారం పుట్టమన్ను సేకరించి అంకుర్పారణ నిర్వహించారు. తిరుమ తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో తొలిసారిగా బ్రహ్మోత్సవాలు జరగుతున్నాయి. కాగా ఆలయ ప్రాంగణంలోని నాగేంద్రుని పుట్ట వద్ద పూజలు నిర్వహించారు. పుట్టమన్ను తీసే కార్యక్రమం ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, సౌమ్యనాథాలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, సూపరింటెండెంట్ వెంకట్వేర్లు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌రాజు,నందలూరు ఎంపీటీసీ సునీతాప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెలనాని, యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి, పెనుబాలనాగసుబ్బయ్య, కాకిచంద్ర, టీటీడీ సిబ్బంది, విజిలెన్స్ పోలీసులు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ గిరీషా పీఎస్



వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ గిరీషా పీఎస్

లక్కిరెడ్డిపల్లి: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ వైద్యాధికారులను ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లె మండలం కోనంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి ప్రతిరోజూ ఎంతమంది రోగులు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు.అనంతరం ఫార్మసీ స్టోర్‌ను తనిఖీ చేశారు. మందుల నిల్వ, ఓపీ సేవలు, సిబ్బంది హాజరు తదితర రిజిస్టర్లను కలెక్టర్ పరిశీలించారు. నిన్న, మొన్న ఎంతమందికి మందులు ఇచ్చారని అడిగి తెలుసుకున్నారు. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రికార్డులను పరిశీలించి ఇచ్చిన మందులకు సంబంధించి ఎందుకు డేటా ఎంట్రీ చేయలేదని ఫార్మసిస్ట్, వైద్య అధికారులపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ప్రభుత్వం డాక్టర్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు అందుబాటులోకి తెచ్చిందన్నారు. విలేజ్ క్లినిక్‌లో మందులు అందుబాటులో ఉండాలని వైద్యులను ఆదేశించారు. అనంతరం వార్డు రూమును పరిశీలించారు. ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రతి ఒక్కరూ జవాబు దారీ తనంతో పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వసతులను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అక్కడి వైద్య సేవలపై ఆరా తీశారు. నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం టీబీ పేషెంట్లకు కలెక్టర్ పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎంపీటీసీ, సర్పంచ్, తహశీల్దార్, ఎంపీడీఓ, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్షతో ఇంటి వద్దకే సేవలు

గాలివీడు: ఇంటి వద్దకే వచ్చి ప్రభుత్వ సేవలు అందించే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ తెలిపారు. మంగళవార మండలంలోని ప్యారంపల్లె , రెడ్డివారిపల్లెలో వలంటీర్లు చేస్తున్న జగనన్న సురక్ష సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్ని ఇళ్లు సర్వే చేశారు, సేవల దరఖాస్తుకు ఎంత మంది అడిగారు, టోకెన్ జనరేట్ చేశారా వంటి వివరాలను వలంటీర్లు, ఎంపీడీఓలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ వలంటీర్ మీ గ్రామంలో సర్వేపై దండోరా వేయించారా అని ప్రశ్నించగా మాకు ముందుగానే సర్వే గురించి తెలియజేశారని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల నాని, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆవుల నాగభూషణ్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు రెడ్డి, ఈఓపీఆర్‌డీ శేఖర్‌నాయక్, పలువురు మండల స్థాయి అధికారులు, సచివాలయం అధికారులు, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో రిజిస్టర్ల నిర్వహణ తప్పనిసరి

ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి

మదనపల్లె : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న 12 రకాల సేవలకు సంబంధించిన రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తూ నిర్వహణ సక్రమంగా చేయాలని ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి ఆదేశించారు. మంగళవారం మదనపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని బొమ్మనచెరువు సెక్టార్ మీటింగ్‌లో సీడీపీఓ సుజాతతో కలిసి పీడీ ధనలక్ష్మి పాల్గొన్నారు. ఎస్‌డీజీ గోల్స్ గురించి, రక్తహీనత కలిగిన తల్లులు, తక్కువబరువు పిల్లలు, ఆర్‌సీహెచ్ ఐడీలు, ఆధార్ కార్డు, 12 రకాల రిజిస్టర్స్ నిర్వహణపై సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రి స్కూల్ నమోదుపై ప్రస్తావించారు. ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగే కార్యక్రమాలు, కేంద్రాల పరిశుభ్రతపై ఆరా తీశారు. ఉదయం 9 గంటల నుంచి 4 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రతిరోజు చేసే కార్యక్రమాలన్నింటినీ పోషణ్‌ట్రాకర్, వైఎస్సార్ యాప్‌లలో తప్పకుండా నమోదుచేయాలన్నారు. సీడీపీఓ సుజాత మాట్లాడుతూ.వైఎస్సార్ కిట్స్, రోజువారి అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై వివరించారు. బీపీఏ కల్యాణి ప్రతినెలా సీ.బి. ఈవెంట్స్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేయాలని సూచించారు కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రకాంత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సెరీకల్చర్ సాగుతో అధిక లాభాలు

మదనపల్లె సెరీకల్చర్ ఏడీ పి. రామ్‌మోహన్



మాట్లాడుతున్న ఏడీ రామ్‌మోహన్

కురబలకోట: సెరీకల్చర్ సాగు ద్వారా అధిక ఆదాయం పొందవచ్చని మదనపల్లె సెరీకల్చర్ ఏడీ పి. రామ్‌మోహన్ అన్నారు. పిచ్చలవాండ్లపల్లెలో మంగళవారం పట్టు పురుగుల పెంపకం, మల్బరీ తోటల నిర్వహణపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆధునిక పద్ధతుల వినియోగం వల్ల నాణ్యమైన మల్బరీ ఆకు దిగుబడి, నీటి ఆదా, ఎరువుల వాడకం తగ్గించుకోవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల వాడకం వల్ల నేల సారాన్ని పెంపొందించుకోవచ్చని, అధిక దిగుబడి సాధ్యమవుతుందని తెలిపారు. జాగ్రత్త, పరిశీలన అవసరమన్నారు. భిన్న వాతావరణ పరిస్థితుల్లో వివిధ రకాల నేలల్లో కూడా సాగు చేయవచ్చని చెప్పారు. రేరింగ్ షెడ్డు, వరండా, యంత్ర పరికరాలు, పనిముట్లు, వివిధ సబ్సిడీలు ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ రసూల్, టీఏ రమణ, వీఎస్ఏ సుహాలే అహ్మద్‌తో పాటు రైతులు గోపాలకృష్ణారెడ్డి, వసంత రెడ్డి, ఆర్‌సి ఈశ్వర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యం

- విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక
- నాడు-నేడుతో మారిన పాఠశాలల రూపురేఖలు
- పాఠశాలల్లో పెరిగిన విద్యార్థులసంఖ్య
- డీఈఓ శ్రీరాం పురుషోత్తం



మాట్లాడుతున్న డీఈఓ శ్రీరాం పురుషోత్తం

సాక్షి ఇంటర్వ్యూ

మదనపల్లె సిటీ: ప్రభుత్వ బడుల బలోపేతమే లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ పని చేస్తోంది. రెండో విడత నాడు-నేడు పనులు త్వరితగతిన పూర్తి చేస్తాం. బడుల రూపురేఖలు మార్చేశాం. టెన్త్‌లో ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఇప్పటి నుంచే ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతాం.. అని జిల్లా విద్యాశాఖాధికారి శ్రీరాం పురుషోత్తం అన్నారు. కొత్త వాతావరణంలో నూతన విద్యా సంవత్సరం ఆరంభమైంది. ఈ నేపథ్యంలో విద్యాశాఖలో తీసుకువస్తున్న నూతన మార్పులపై ఆయనతో జరిపిన ఇంటర్వ్యూ వివరాలు..

ప్ర: జిల్లాలో రెండో విడత నాడు-నేడు పనులు ఎలా జరుగుతున్నాయి?

జ: జిల్లాలో రెండో విడత నాడు-నాడు పనులు 1037 పాఠశాలల్లో చురుగ్గా సాగుతున్నాయి. పనులు త్వరితగతిన పూర్తి చేయకపోతే వారిపై చర్యలు తీసుకుంటాం. ప్రధానంగా నాడు-నేడు మొదటి ఫేస్‌లో ఆగిన కొన్ని పనులను 2.ఎ కింద 600 పాఠశాలల్లో చేస్తున్నాం. రెండో విడతలో విద్యుత్, తాగునీరు, రన్నింగ్ వాటర్ విత్ టాయిలెట్స్, కిచెన్‌షెడ్స్ పనులకు అధిక ప్రాధాన్యత ఇచ్చాం. దీని ప్రకారం పనులు చేస్తున్నాం.

ప్ర: జేవీకే కిట్ల పంపిణీ ఎలా జరుగుతోంది?

జ: పాఠశాల తెరిచిన రోజే విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేశాం. ఇప్పటి వరకు జిల్లాలో 90 శాతం పైగానే ఇచ్చాం. నోటు పుస్తకాలు త్వరలోనే అందిస్తాం. ఈసారి జేవీకే కిట్లలో నాణ్యత ఉండేలా చర్యలు తీసుకున్నాం. యూనిఫాంకు సంబంధించి కుట్టుకూలీ విద్యార్థుల తల్లుల ఖాతాలలో జమచేస్తాం.

ప్ర: విద్యార్థుల అభ్యసనా స్థాయి పెంచడానికి తీసుకునే చర్యలు?

జ: విద్యార్థుల్లో అభ్యసనా స్థాయి తక్కువ ఉన్నవారి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రత్యేక ప్రణాళిక అమ లు చేస్తున్నాం. చదవడం, రాయడం రాని వారి కో సం లిప్ కార్యక్రమం ద్వారా వారిలో సంబంధిత సామర్థ్యాలను పెంపొందించడానికి కృషి చేస్తున్నాం.

ప్ర: ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాల్లో అడ్మిషన్లు ఎలా ఉన్నాయి?


జ: గత ఏడాదితో పోలిస్తే ఈసారి ప్రభుత్వ బడుల్లో అడ్మిషన్లు పెరిగాయి. 3వ తరగతి నుంచి సబ్జెక్టు టీచర్లను నియమించాం. డిజటల్ బోధన కోసం బోర్డులు ఏర్పాటు చేశాం. దీంతో ప్రభుత్వ బడులపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం పెరిగింది. గత ఏడాది కంటే ఈ ఏడాది 15 శాతం వరకు అడ్మిషన్లు పెరిగాయి. ఆగస్టు వరకు అడ్మిషన్లు జరుగుతాయి. అప్పటికి విద్యార్థుల నమోదు మరింత పెరిగే అవకాశం ఉంది.

ప్ర: పాఠశాలల్లో ఉపాధ్యాయుల, విద్యార్థి నిష్పత్తి ప్రకారం నియమించారా?

జ: ఇటీవలనే ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ బదిలీలు నిర్వహించాం. అన్ని పాఠశాలల్లోనూ అవసరమైన ఉపాధ్యాయులను నియమించాం. ఎక్కడైనా టీచర్లు అవసరమైతే ఆయా పాఠశాలల్లో టీచర్లను నియమిస్తాం.

ప్ర : పాఠశాలల పర్యవేక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: పాఠశాలల పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. రోజువారి సంబంధిత విద్యాధికారులు పాఠశాలలను తనిఖీ చేస్తున్నారు. ప్రభుత్వం ఇటీవలనే ఎంఈఓ-2 పోస్టులను భర్తీ చేసింది. వీరి ప్రధాన బాధ్యత పాఠశాలలను పర్యవేక్షించడమే.



తిరుపతి వెంకన్న సాక్షిగా
ఎవిస్ హాస్పిటల్స్ వైద్య సేవల విస్తరణ
డాక్టర్ పి. విజయ్ కుమార్
కరోనా భయం లేని విధంగా వైద్య సేవలు అందించెదరు.
MBBS, DNB, FNAS, DMAS, FAIS.
Varicose veins specialist & Minimal Invasive Surgeon
తేది: 29-06-2023 గురువారం, తిరుపతిలో
ఉ.10.00 గం.ల నుండి సా. 4 గం. ల వరకు
దిగువ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటారు
అంకుర హాస్పిటల్
అపాయింట్‌మెంట్ కోసం
9989527715



అంత్యక్రియలు
మా తండ్రి గారైన శ్రీ సూరా రాజశేఖర్‌రెడ్డి గారు
26-06-2023వ తేది సోమవారం స్వర్గస్తులైనారు. తదుపరి 28-06-2023వ తేది బుధవారం ఉ॥ 9.00 నుండి 10.00 గంటల మధ్య కడప జిల్లా, చెన్నూరు టౌన్ మా స్వగ్రామము నందు వీరి అంత్యక్రియలు జరుగును. కావున మా బంధుమిత్రులకు, శ్రేయోభిలాషులకు తెలియజేయుచున్నాము.
బాధాతప్త హృదయాలతో...
కీ॥శే॥ సూరా రాజశేఖర్‌రెడ్డి గారు
Rtd. AE (APSPDCL)
ఇట్లు - భార్య :
కుమార్తెలు - అల్లుళ్ళు
మరియు కుటుంబ సభ్యులు

క్లుప్తంగా

ఆటో బోల్తా.. బాలుడి దుర్మరణం


మృతి చెందిన రెడ్డిగణేష్

రామాపురం : కర్నూలు – చిత్తూరు జాతీయ రహదారిలోని మండల పరిధిలోని నల్లగుట్టపల్లె సచివాలయం క్రాస్ రోడ్డులో మంగళవారం ఆటో బోల్తా పడటంతో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. రామాపురం నుంచి బీసీ కాలనీకి చెందిన తురక సూరి, రవి, రవి బంధువుల పిల్లవాడైన లక్కిరెడ్డిపల్లె మండలం దిన్నెపాడుకు చెందిన బత్తెన రెడ్డి గణేష్(2) ఆటోలో వెళ్తుండగా బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బాలుడు గణేష్ అక్కడికక్కడే మృతి చెందగా, మరొకరికి గాయాలు అయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గణేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరణవార్త తెలియడంతో బాధిత కుటుంబం శోకసంద్రంలో మునిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తొమ్మిదేళ్లలో దేశం ఎంతో అభివృద్ధి


మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాధవ్

రాయచోటిటౌన్ : తొమ్మిదేళ్ల కాలంలో భారత దేశాన్ని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎంతో అభివృద్ధి దిశగా తీసుకెళ్లారని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు తెలియజేయాలనే కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక ఎస్ఎన్ కాలనీలో ఆ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగతంగా ఎదిగేందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు ఏవీ సుబ్బారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర వెంకట శివనారాయణ, జిల్లా ఇన్చార్జిలు చంద్రమౌళి, సాయిలోకేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘురామిరెడ్డి, నాగరెడ్డెయ్య, రాష్ట్ర కో ఆపరేటివ్ కన్వీనర్ గోపాల్ రెడ్డి, యువమోర్చా మాజీ జాతీయ కార్యదర్శి పొనతల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు పి. నరేంద్రకుమార్‌రెడ్డి, చీర్ల శ్రీనివాస యాదవ్, రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ శివగంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిహారం పంపిణీకి కసరత్తు

- గండికోట ముంపు బాధితులను ఆదుకుంటున్న ప్రభుత్వం
- త్వరలో 14 గ్రామాలకు 3.25 లక్షల అందజేతకు చర్యలు

జమ్మలమడుగు : గండికోట ముంపు గ్రామాల ప్రజలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు పది లక్షల రూపాయల పరిహారం అందించబోతున్నారు. మొదటి విడత కింద ఉన్న 14 గ్రామాల్లో 9096 మంది ముంపు బాధితులు ఉండగా అందులో 4195 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద, 4901 మందికి వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పరిహారం రూ.6.75 లక్షలు అందించారు. 1179 మందికి సరైన పత్రాలు లేకపోవడంతో ఇవ్వలేదు. సరైన ఆధారాలుంటే తప్పకుండా ఇస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

- రెండోవిడత గ్రామాలైన కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి గ్రామాల్లో మొత్తం 7047 మంది ముంపు బాధితులు ఉండగా అందులో 1561 మంది ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, 5486 మంది వన్‌టైం సెటిల్ మెంట్ ఆప్షన్ తీసుకున్నారు. వీరిలో 6837 మందికి పరిహారం ఇచ్చారు.ఇంకా 210 మందికి ఇవ్వాల్సి ఉంది. రెండో విడతలో 95 శాతం పరిహారం అందినట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.
- మూడో విడత గ్రామాలైన పెంజిఅనంతపురం, ఏటూరు, రేగడిపల్లి, కె.సుగుమంచిపల్లె గ్రామాల్లో 1666 మంది ముంపు బాధితులు ఉన్నారు. ఇందులో 100 మంది ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ, 1566 మంది వన్‌టైం సెటిల్ మెంట్ ఆప్షన్ తీసుకున్నారు. ఇప్పటి వరకు 668 మందికి పరిహారం అందింది. 998 మందికి అందాల్సి ఉంది.


గండికోట ప్రాజెక్టు

ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గండికోట ముంపు బాధితులకు రూ.6.75 లక్షలతోపాటు అదనంగా 3.25 లక్షలు పరిహారం అందిస్తామని 2019 ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముంపు బాధితులకు పరిహారం అందించే ప్రక్రియను మొదలు పెట్టారు. 2021లో గండికోటలో పూర్తి స్థాయిలో నీరు నిలపాలనే ఉద్దేశంతో రెండో విడత, మూడో విడత గ్రామాలైన కొండాపురం, తాళ్లప్రొద్దుటూరు, చామలూరు, ఎర్రగుడి, పెంజి అనంతపురం, ఏటూరు, రేగడిపల్లి, కె.సుగుమంచిపల్లె గ్రామాల ప్రజలకు త్వరితగతిన పది లక్షల రూపాయల పరిహారం ఇచ్చిన తర్వాతనే ఇళ్లను ఖాళీ చేయించారు. ప్రస్తుతం మొదటి విడత కింద ఎంపికైన 14 గ్రామాలైన చౌటపల్లి, సీతారామపురం, గండ్లూరు, ఓబన్నపేట, కె.బొమ్మేపల్లి, దొరువుపల్లి, బుక్కపట్నం, గంగాపురం, రేపల్లి, ముచ్చుమర్రి, పక్కీర్‌పేట, దత్తాపురం, నేదరపేట, ముద్దనూరు మండలంలోని కొర్రపాడు గ్రామాలు ఉన్నాయి. వీరికి రూ.6.75 లక్షల పరిహారం అందించారు. ప్రస్తుతం వీరికి రూ.3.25 లక్షల పరిహారం ఇవ్వడం కోసం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక చర్యలు తీసుకుంది. మరో రెండు మూడు నెలల్లో వీరి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది.

రూ.10 లక్షల పరిహారం తీసుకున్న గ్రామాలు

గ్రామం	ముంపు బాధితులు	పరిహారం ఇచ్చింది	పెండింగ్
రెండో విడత			
కొండాపురం	3066	3009	57
తాళ్లప్రొద్దుటూరు	2869	2734	135
చామలూరు	587	572	15
యర్రగుడి	525	522	03
మొత్తం	7047	6837	210
మూడో విడత			
పెంజి అనంతపురం	677	26	651
ఏటూరు	291	248	43
రేగడిపల్లి	274	248	26
కె.సుగుమంచిపల్లి	424	146	278
మొత్తం	1666	668	998

వివరాలు సేకరిస్తున్నాం



మొదటి విడత కింద ముంపునకు గురైన 14 గ్రామాల ప్రజలకు రూ.3.25 లక్షలు అదనంగా ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయంలో ఆధార్ కార్డులతోపాటు, బ్యాంక్ అకౌంటు నంబర్లు ఇవ్వాలని ముంపు బాధితులకు సూచించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన వెంటనే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేస్తాం. రికార్డుల ప్రకారం ఇప్పటి వరకు 7917 మందికి ఒక్కొక్కరికి రూ.6.75 లక్షల పరిహారం ఇచ్చాం. మరో 1179 మందికి ఇవ్వలేదు.
– జి.శ్రీనివాసులు, ఆర్డీఓ, జమ్మలమడుగు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి ఆట్యా, పాట్యా పోటీలకు ఎంపికైన బాలికల జట్టు

సిద్దవటం : ఆట్యా, పాట్యా రాష్ట్ర స్థాయి పోటీలకు మంగళవారం సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాకు చెందిన క్రీడాకారుల ఎంపిక జరిగిందని జిల్లా కార్యదర్శి సుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోపవరం మండలం బ్రాహ్మణపల్లె, మైదుకూరు, దువ్వూరు, సిద్దవటం, బద్వేల్, చాపాడు, నందలూరు మండలం లేబాక, రాయచోటి, రాజంపేట, ఓబులవారిపల్లె, ప్రాంతాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి అండరు 14–విభాగానికి చెందిన బాలురు, బాలికలు హాజరయ్యారన్నారు. వీరిలో అన్నమయ్య జిల్లాకు సంబంధించి 12 మంది బాలురు, 12 మంది బాలికలు ఎంపికయ్యారన్నారు. వైఎస్సార్ జిల్లాకు సంబంధించి బాలురు 12 మంది, బాలికలు 12 మంది మొత్తం 48 మంది క్రీడాకారులు ఎంపికయ్యారన్నారు. వీరు జూలై నెల 1,2, తేదీలలో రాజమండ్రి దగ్గర తునిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం. శ్రీరాములు, పిడి రెడ్డెమ్మ, రామలింగరాజు, హరికొండయ్య, పిడి శివారెడ్డి, విశ్వనాథ్, పీఈటీ గీతా, సుధాకర్‌రెడ్డి, సుబ్బరాజు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

బాకీ తీర్చాలన్నందుకు తల్లీకుమారులపై దాడి



గాయపడిన పవన్ కుమార్, లక్ష్మీదేవి

మదనపల్లె : తీసుకున్న అప్పు తీర్చమన్నందుకు తల్లీకొడుకులపై సొంత బంధువులే కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. పట్టణంలోని వివేకానంద నగర్ హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీ వద్ద నివాసం ఉన్న నరసింహులు భార్య లక్ష్మీదేవి (43), మూడు సంవత్సరాల క్రితం తన సొంత అక్క అయిన మహేశ్వరికి నాలుగు లక్షల రూపాయలను అప్పుగా ఇచ్చింది. అయితే ఆమె కరోనా కారణంగా మృతి చెందింది. దీంతో పట్టణంలోని ఆర్‌ఆర్ స్ట్రీట్లో మహేశ్వరి జువెలర్స్ దుకాణం నిర్వహిస్తున్న అక్క భర్త వెంకట నారాయణను అప్పు చెల్లించాలని అడిగింది. ఆయన అప్పు చెల్లించకపోగా నిర్లక్ష్యం వహించడంతో, ఇదే విషయమై పంచాయితీ జరిగింది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి లక్ష్మీదేవి తన కుమారుడు పవన్ కుమార్ (27)తో కలసి మహేశ్వరి జ్యువెలర్స్ దుకాణం వద్దకు వెళ్లి తన బాకీ తీర్చాల్సిందిగా బావ వెంకటనారాయణ మరోమారు నిలదీసింది. బాకీ చెల్లించేది లేదంటూ వెంకటనారాయణ అతని కుమారుడు హరీష్ ఆమెతో దురుసుగా ప్రవర్తించారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. పట్టరాని కోపంతో వెంకటనారాయణ, హరీష్, ఇద్దరు కలిసి లక్ష్మీదేవి, పవన్ కుమార్ లపై ఒక్కసారిగా కత్తితో దాడికి పాల్పడ్డారు. దాడిలో లక్ష్మీదేవికి తీవ్ర గాయాలు కాగా, పవన్ కుమార్ సైతం గాయపడ్డాడు. వెంటనే స్థానికులు బాధితులని స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. వన్టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హోటల్ కార్మికుడిపై ఆటో డ్రైవర్ దాడి


గాయపడిన ఆది

మదనపల్లె : హోటల్ కార్మికుడిపై ఆటో డ్రైవర్ దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం రాత్రి మదనపల్లె పట్టణంలో జరిగింది. స్థానిక చంద్ర కాలనీకి చెందిన ఆది (44) నీరు గట్టువారిపల్లెలోని హోటల్లో పని చేస్తూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి యథావిధిగా హోటల్‌లో పనులు ముగించుకొని ఇంటికి వెళ్లేందుకు వస్తూ మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉండగా, ఆటో డ్రైవర్ దురుసుగా వాహనాన్ని నడపడంతో ఆది కాలికి గాయమైంది. వెంటనే తన కాలిగాయానికి కారణమైన ఆటో డ్రైవర్‌ను నిలదీశాడు. నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేసి తనను ఎందుకు గాయపరిచావంటూ ప్రశ్నించాడు. దీంతో ఆటో డ్రైవర్ ఆటోలో ఉన్న రాడ్ తీసుకుని ఆది తలపై కొట్టాడు. ఈ దాడిలో బాధితుడు ఆది తీవ్రంగా గాయపడటంతో స్థానికులు 108 వాహనంలో స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి


బెటాలియన్‌లో పోలీసులు వెపన్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో పరిశీలిస్తున్న డీఐజీ వెంకటేశ్వర్లు

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్ పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కర్నూలు రేంజి ఏపీఎస్పీ బెటాలియన్‌ల –3 డీఐజీ సి.హెచ్. వెంకటేశ్వర్లు తెలిపారు. సిద్దవటం మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో వార్షిక తనిఖీలో భాగంగా రెండవ రోజు మంగళవారం పరేడ్‌ను తిలకించారు. పోలీసులు వెపన్స్‌ను ఎలా ఉపయోగిస్తున్నారో పరిశీలించారు. అధికారులు, సిబ్బందికి దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆయన బెటాలియన్ పరిసరాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో కమాండెంటు ఎన్. శ్రీనివాసరావు, అడిషనల్ కమాండెంటు కె.ప్రభుకుమార్, అసిస్టెంటు కమాండెంట్లు వి.కేశవరెడ్డి, కె.వెంకట్‌రెడ్డి, పి.ఎస్.డి.ప్రసాద్, వి.జయప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఉద్దేశాలు ప్రజలకు వివరించాలి


సంక్షేమ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి

నందలూరు (రాజంపేట) : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న సురక్షపై ఇంటి వద్దకే వెళ్లి ప్రజలకు కార్యక్రమ ఉద్దేశంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టరు సత్యనారాయణ అన్నారు. నందలూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి చాంబరులో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలన్నారు. వలంటీర్లు తమ పరిధిలోని ఇళ్లకు వెళ్లి అవసరమైన అంశాలను చర్చించాలన్నారు. అందుకు సంబంధించి ఆధారాలను సేకరించాలన్నారు. సచివాలయం డిజిటిల్ అసిస్టెంట్‌తో నమోదు చేయాలన్నారు. షెడ్యూల్ ప్రకారం జరిగే జగనన్న సురక్ష సభలలో ప్రజలు కోరిన సర్టిఫికెట్స్‌ను ఉచితంగా అందజేయాల్సి ఉంటుందన్నారు. నందలూరు ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహించాలన్నారు. అనంతరం జగనన్న సంక్షేమ క్యాలెండర్‌ను పీడీ సత్యనారాయణ, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సౌభాగ్య, మండల సచివాలయ కన్వీనరు కలీం, ఎంఎల్ఓ శ్రీనివాసులు, తహసీల్దారు వైఎస్ సత్యప్రకాశ్, వైఎస్సార్‌సీపీ నేతలు నడివీధి సుధాకర్, అరిగెలనాని, యల్లంరాచపల్లె సుబ్బారెడ్డి, నాగసుబ్బయ్య, కాకిచంద్ర, అక్కిరెడ్డి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సోమశిల ముంపు ప్రాంతం పరిశీలన


ముంపు గ్రామాలను పరిశీలిస్తున్న సీఈ వెంకట రమణ

ఒంటిమిట్ట : సోమశిల ప్రాజెక్ట్ వెనుక జలాల ముంపు ప్రాంతాలైన మండల పరిధిలో తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామాల్లో మంగళవారం సోమశిల జలాశయం సీఈ ఎం. వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పెటవారిపల్లి, పెన్నపేరూరు గ్రామస్తులు సోమశిల వెనుక జలాల కింద తమ గ్రామాలను కూడా కలపాలని హైకోర్టులో వేసిన పిటీషన్ కు సంబంధించి కోర్టు కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయమనడంతో.. ఈ గ్రామాలను సందర్శించి, సోమశిల వెనుక జలాలకు సంబంధించి బౌండరి రాళ్లను పరిశీలించారు. అనంతరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి ఆలయానికి చేరుకుని, సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు. ఈయన వెంట ఎస్ఈ బి.వి.రమణరెడ్డి, ఈఈ ఎం.వెంకట రమణరెడ్డి, ఏఈ శివప్రసాద్‌రెడ్డి, డీఈ జి.నరేంద్ర, గ్రామ పెద్దలు గజ్జల శ్రీనివాసులరెడ్డి, ముమ్మడి నారాయణరెడ్డి ఉన్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రైల్వేస్టేషన్ సమీపంలో గూడ్స్ షెడ్ వద్ద మంగళవారం రాత్రి సాయికుమార్ (30) అనే యువకుడు గూడ్స్ రైలు కింద పడి మృతి చెందినట్లు కడప రైల్వే ఎస్సై రారాజు తెలిపారు. చెన్నూరు అరుంధతివాడకు చెందిన సాయికుమార్ కూలీ పనులు చేసుకుంటూ ఉండే వారన్నారు. కుటుంబ సమస్యలతో మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించామని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పోలీస్‌స్టేషన్ ఎదుట ఆత్మహత్యాయత్నం


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రాజప్ప

రామసముద్రం : స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట మంగళవారం ఓ వ్యక్తి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. పోలీసులు గమనించి అతన్ని వెంటనే స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాధితుడు, అతని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం మండలం కాప్పల్లికి చెందిన జె.నారాయణప్ప కుమారుడు రైతు జె.రాజప్ప(45) ఉదయం రామసముద్రం పోలీస్‌స్టేషన్ ముందు విషం తాగి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి ఫిర్యాదు పేపర్ ఇచ్చాడు. అదే పంచాయతీ గజ్జవవారిపల్లికి చెందిన వీరభద్ర భార్య కళావతి తనను వేధిస్తున్నాడని తనపై అక్రమంగా పిటిషన్లు పెట్టి అధికారులతో ఫోన్లు చేయించి వేధిస్తోందని తెలిపాడు. తన చావుకు కళావతి కారణమని చెప్పాడు. వెంటనే స్టేషన్‌లో ఉన్న సిబ్బంది అతని పరిస్థితి చూసి రామసముద్రం పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. ఆసుపత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. అనంతరం కుటుంబీకులు అతన్ని బెంగళూరుకు తరలించారు. తనకు కళావతి కొంత నగదు ఇవ్వాల్సి ఉందని బాధితుడు చెప్పాడు. ఏడాదిగా ఆర్థిక విషయాల కారణంగా గొడవ పడుతూ ఆమె తనపై అనేక పర్యాయాలు కలెక్టర్, ఎస్పీకి పిటిషన్ పెట్టిందన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల


ప్రజలకు సంక్షేమ పథకాలపై వివరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల

పుల్లంపేట : ప్రజల సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. మండల పరిధి కొమ్మనవారిపల్లి, దళవాయిపల్లి గ్రామ పంచాయతీలోని శ్రీరాములపేట గ్రామంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని స్థానిక ఎంపీటీసీ ఎర్రబాపు శైలజ, మల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాజంపేట పార్లమెంటు సభ్యులు పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులపై అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. పాఠశాలల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలిస్తూ కార్యక్రమం కొనసాగించారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తి చూపారు. అదే విధంగా గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వానికి తేడాలను ప్రజల చేత చెప్పించారు. జగనన్న చేపట్టిన పథకాలు అందుతున్నాయో లేదో ఆరా తీశారు. సమస్యలు ఏవైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం దళాయపల్లి గ్రామ పంచాయతీ అభివృద్ధికి కోటి రూపాయల నిధులు మంజూరు చేయనున్నట్లు ఎంపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, మండల కన్వీనర్ ఎస్ ముస్తాక్, జెడ్‌పీటీసీ దార్ల రామనాథం, ఎంపీటీసీ మల్లికార్జునరెడ్డి, ఏపీ టూరిజం డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి, మండల జేసీఎస్ ఇన్‌చార్జి హరినాథరెడ్డి, రైల్వే కోడూరు వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, చిట్వేలి మండల ఇన్‌చార్జి చెవ్వు శ్రీనివాసులరెడ్డి, సర్పంచ్ వహిదా, డీఎస్పీ చైతన్య, సీఐ పుల్లయ్య, ఎంపీడీఓ రఘురాం, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, మూలి శంకర్ రెడ్డి, ఎం.వెంకటరెడ్డి, వల్లూరుపల్లి రాజారెడ్డి, వలంటీర్లు, గృహసారథులు, కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జూనియర్ న్యాయవాదులకు వరం లా నేస్తం

రాయచోటి టౌన్ : జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం ఒక వరంలా మారుతుందని ఏపీపీ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. లా నేస్తం మంజూరుపై హర్షం వ్యక్తం చేస్తూ రాయచోటి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ప్రాక్టీస్ ప్రారంభించిన జూనియర్ న్యాయవాదులకు ఈ పథకం చాలా ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ రామాంజనేయులు, వీసీ రెడ్డెప్పరెడ్డి, అసిస్టెంట్ గవర్నమెంట్ న్యాయవాది వై.రమేష్‌రెడ్డి, బి.నరసింహారెడ్డి, పి.రెడ్డిబాషా, డి.జనార్ధన్‌రెడ్డి, ఆర్ వీరభద్రయ్య, డి.రాంకుమార్, సీవీ రమణ మూర్తి, జూనియర్ న్యాయవాదులు ఎల్.లోహిత, ఆర్‌డీ ఆనంద్, ఎస్.మధుమిత తదితరులు పాల్గొన్నారు.


సమావేశం నిర్వహిస్తున్న న్యాయవాదులు

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

ఉచిత శిక్షణ ఉపాధి
■ గ్రామీణ నిరుద్యోగ యువతకు 4 నెలల కాల వ్యవధిలో కంప్యూటర్ హార్డ్వేర్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, కోర్సులలో ఉచిత శిక్షణ, భోజన వసతి సదుపాయం, అర్హతను బట్టి ఉపాధి అవకాశాలు కల్పించబడును. Nihar skill Education,కడప. సంప్ర: 9063082227. [C-785822]

PARAMEDICAL
■ B.Sc Nursing,BPT& Paramedical Courses Available. DMLT, Anesthesia, Dialysis, Cardiology, Cathlab, Opthalmic. Any Inter Eligible, Tirupati, 7416478396, 7416478395. [T-1450]

SERVICE

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V- 6166]

CHANGE OF NAME
■ I, SYED ASMA BEGUM R/oF D.No.1/11, Agraharam, Adapur Nandalur, Annamayya Dist., A.P. Now I Change My Name as SHAIKH ASMA BEGUM(New name). [C-785825]
■ I, SACHIN KUMAR R/oF D.No.17/361, B.K.M Street, Kadapa Dist., A.P. Now I Change My Name as GULAB SACHIN KUMAR JAIN (New name). [C-785826]
■ I, MANDALA LAVANYA LALITHA LATHA R/oF D.No.9/315, Agadi Street, Saipeta, Kadapa Dist., A.P. Now I Change My Name as PASUPULA LAVANYA LALITHA LATHA (New name). [C-785827]
■ I, KAMBAM SUBBALAKSHMAMMA R/oF D.No.1/13, Patha Bazar,Railway Kodur, Cuddapah Dist., A.P. Now I Change My Name as KAMBHAMA SUBBALAKSHUMMA (New name). [C-785828]

శ్రీ మహాలక్ష్మి మ్యారేజ్ లింక్స్
■ 7/562-A-4, IInd Floor, NGO కాలని, కడప 1st, 2nd, Widow, Late Marriage, Widowes, All Castes, దేశ/ విదేశీ సంబంధాల కొరకు సంప్రదించగలరు: 7899499023. [C-785893]

GOLD FINANCE
■ బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2404]

సాయిరాం జ్యోతిష్యాలయం
■ పండిట్ సాయిరాం శాస్త్రి గారు మీ హస్త సాముద్రికం చేసి సంపూర్ణ జ్యోతిష్యం చెప్పగలరు. విద్య, ఉద్యోగం, ధనప్రాప్తి, యోగం, స్త్రీ, పురుషులకు ఎటువంటి సమస్యలు ఉన్న సంప్ర: 8309917682. [C-785820]

WANTED
■ టీచర్స్ కావలెను: కడప నగరంలోని ప్రముఖ నజ్‌మూల్ అమీన్ E.M. స్కూల్ నందు నర్సరీ నుండి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులు బోధించుటకు అనుభవం గల టీచర్స్ కావలెను. 6301553011, 9885111115. [C-1191657]
■ WANTED TEACHERS for Hindi, Social for High School. Free accommodation. Contact : 8639096944, 8142660770. [C-785892]
■ ఉమ్మడి కడప జిల్లా నందు పులివెందుల, వేంపల్లి, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాజంపేట ప్రాంతాలకు Beverage Product's సప్లై చేయుటకు Distributer's కావలెను. సంప్రదించవలసిన నెం: 8333811286. [C-785817]
■ Wanted Medical Repre- sentatives for Proddatur, Kadapa. Cont: 7032640251. [C-785829]
■ ప్రముఖుల ఇళ్ళ వద్దనే ఉండి వృద్ధులను, బెడ్ పేషెంట్లను చూసుకొనుటకు M/F కేర్ టేకర్స్, ఆయాలు, నర్సులు కావలెను. జీతం 14-20K, వసతి + భోజనం, VJA ✆ 91608 35559, 78158 35561 [B-183]
■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు కావలెను,ఆయా, వార్డ్ బాయ్స్,నర్సులు, వంటవారు, RMP Dr. Q:5th-Degree, 10-30 వేల జీతం, భో+రూం ఫ్రీ. Hyd. ఫోన్ : 7995984445. [HA-340]
■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ కావలెను. ఫ్రీ వసతి+భోజనం, జీ: 18K హైదరాబాద్ : 9640258899, విజయవాడ: 9640648899 [HA-337]
■ ప్రముఖ బ్యాంకుల యందు కాంట్రాక్టు/ ఔట్ సోర్స్‌లో వర్క్ చేయడానికి ఫీమేల్ స్టాఫ్ ఆ॥కా॥ ను. జీ: 15k–34k. ఇంట్రెస్ట్ ఉన్నవారు డీటేల్స్ వాట్సాప్ చేయండి. ఫోన్ : 6281159171 [HA-29751]
■ UC Info Tech సంస్థ నందు (15,000/- to 20,000/-) పనిచేయుటకు (వ : 18 to 28 లోపు, Un Married) యువతీ, యువకులు (10th, ఇంటర్, ITI, Dip, PG) ఉచిత వసతి. ఫోన్ : 77996 54777, 93905 28568 [V-2853]
■ పోరుమామిళ్ళ దగ్గర పనిచేయుటకు అనుభవం (3-4సం॥)గల డ్రైవర్స్ కావలెను, జీతం: 16,000/- రూం+ ఫుడ్ ఫ్రీ & Hyd లో సె॥గార్డ్స్, సూ॥వైజర్స్ కావలెను. ఫోన్ : 9885657755. [H-781448]
■ మా యొక్క ప్రముఖ సంస్థకు మొబైల్ ద్వారా సమాచారం పంపుతూ అధిక ఆదాయం సంపాదించుకోండి. మీ అడ్రస్ వాట్సాప్ చేయండి. వివరాలకు కాల్ చేయండి. 95736 33520, 90596 33520. [M-1221323]
■ TTD నందు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేయుటకు హౌస్ కీపింగ్ Staff కావలెను, జీ: 10,000 + PF +ESI + Bus Pass, M/F, Age: 45 లోపు, #81860 60777. [T-4391]
■ కొత్తగా ప్రారంభించిన మా కంపెనీ నందు 39 మంది స్త్రీ/పుతు ఉద్యోగాలు కలవు. జీ : 14000+DA8000+ఫ్రీ రూమ్. అర్హత : 7th డిగ్రీ, సంప్ర : గాంధీ రోడ్డు, SBI మెయిన్ బ్రాంచి ప్రక్కన, ప్రొద్దుటూరు. సెల్ : 95024 00850. [A-7568]
■ ఓల్డ్ రికార్డు చూసి న్యూ రికార్డు రాయుటకు స్త్రీ పురుష అభ్యర్థులు 12 మంది కావలెను. నెలకు జీతం : 12000/-. ఫోన్ : 70756 56208 [V-6172]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి
క్లాసిఫైడ్స్ కొరకు సంప్రదించండి
9705944423
9705907418
9010223797
9010072409